

మంచెచ్చిపోతున్నారు

బి.పి.యస్. పట్నాయక్

పట్నం నుండి తిరిగొచ్చిన పవన్ నీరసంగా ఇంట్లోకొచ్చి సోఫాలో కూలబడ్డాడు. కొడుకు రావడం గమనించిన తండ్రి బసవరాజు గదిలో మంచంపై నుండి దగ్గుతూనే, "అరుంధతీ... అరుంధతీ" అంటూ ఆయాసంతో పిలిచాడు అనేకన్నా అరిచాడు.

"అత్తయ్య పెరట్లో కోళ్లకు దాణా కలుపుతున్నారు మావయ్యా! విషయం ఏమిటో తెలుసుకోమన్నారు!" అంటూ వచ్చిన కోడలు కౌశల్యని చూసి-

"అబ్బాయి పట్నం నుండొచ్చినట్టుంది. అదిగో ఆ సోఫాలో నిస్త్రాణంగా కూలబడ్డాడు. వెళ్లి చూడమ్మా!" చివరమాటను దగ్గుతూనే పూర్తిచెయ్యలేకపోయాడు.

ఆశ్చర్యంగా హాల్లోకి చూసిన కౌశల్య, గభాలున అటుగా కదిలింది. సోఫాలో కూర్చున్న భర్తని చూసి ఆశ్చర్యం, అనుమానంతో భృకుటి ముడిచి "ఏమండీ!" అంటూ భర్త భుజం పట్టి కుదిపింది.

ఆలోచనల తల్లీనతలో సతమతమవుతున్న పవన్ కాస్త చిరాకుగా "ప్లీజ్! నన్ను కాస్సేపు ప్రశాంతంగా ఉండనీయ్" తన భుజం మీదున్న భార్యచేతిని తొలగించాడు.

భర్త చిరాకును చూసి బెదిరిపోయింది కౌశల్య.

"కాఫీ తీసుకురానా!" మెల్లగా అడిగింది.

"అబ్బబ్బ! నన్ను విసిగించకు!" కోపంగా అన్నాడు.

కౌశల్య మాట్లాడలేదు. దెబ్బ తిన్నట్లు చూసింది భర్తని. అక్కడ నుండి పెరట్లోకి గబగబ నడిచింది.

తడిచేరిన కనురెప్పలు తుడుచుకుంటూ తలవంచుకొని ముఖాన్ని విచారంగా మార్చి.

"అత్తయ్యా! వారు వచ్చారు. ఎందుకో దిగాలుగా, చిరాకుగా ఉన్నారు" అంది.

కదిలిన కందిరీగల్లా పవన్ బుర్రలో ఆలోచనలన్నీ భవిష్యత్ మీదనే నిలచి నిలకడలేని ఎన్నో ప్రశ్నలు తలెత్తి కంటిముందు దుగ్గోచరమై భయంతో శరీరం ప్రకంపించింది.

డిగ్రీ పూర్తయ్యాక, తండ్రి ఇహ నావల్లకాదని చేతులెత్తేస్తే, తను ఉద్యోగం కోసం అంటూ ఎన్నిరకాలుగా ప్రయత్నించినా ఫలితం శూన్యంగా ఉండేది.

కనీసం ఏ చిన్నుద్యోగమైనా దొరకదనే నమ్మకం గునపంలా గుండెల్లో నాటుకుపోయింది.

ఇప్పుడు దేశ స్థితిగతులను బట్టి చూస్తే సూదికన్నంలోకి మత్తగజాన్నైనా దూర్చగలమేమోగాని, ఉద్యోగాన్ని సాధించడం సాధ్యంకాదని గ్రహించాక, ఒక నిర్ణయానికొచ్చి, ఆ విషయాన్నే తన మేనమామతో చెప్పుకొని పరిష్కారమార్గం చెప్పమన్నాడు పవన్.

"ఓరి, నా పిచ్చిమేనల్లుడా! మీనాన్నకు నేనప్పుడే చెప్పాను. మనకు సదువెందుకు. నీ కొడుకుతో ఏదైనా యాపారం ఎట్టించమని, స్సే! నా సలహాను కాదన్నాడు. మా రోజుల్లో చదువుకున్నోల్లు తక్కువ మందుండేవారు. ఆళ్లలో సగానిపైగా ఉద్యోగాలు దొరికేవి. మరిప్పుడో అందరూ డిగ్రీలు స్సేస్తుంటే గవర్నమెంట్ మాత్తరం ఎంతమందికిస్తాది ఉద్యోగాలు. అయినా అందరూ పల్లకీ ఎక్కేవారైతే మరా పల్లకీని మోసెదెవరంటాను?" తెలివిగా ప్రశ్నడిగిన మేనమామను నమిలి మింగెయాలన్నంత కోపం వచ్చింది.

"ఇప్పుడేం చెయ్యాలని సలహా అడిగితే! ఈ బిల్డప్పేంటి మావయ్యా!" అసహనంగా అన్నాడు పవన్.

"అదిగో! మీకుర్రాళ్లంతా ఇంతే! తొందరెక్కువ, ఆలోసన తక్కువ, నన్ను నీవు సలహా అడిగావు గనుక, నీ మేలు గోరే మేనమామను కనుక ఇప్పుడుకూడా నేను సెప్పేది అదే! నువ్వు ఆలస్యం సేయకుండా ముందు ఏదైనా యాపారం ప్రారంబించు" అన్నాడు మేనమామ ముకుందం.

"వ్యాపారమా?" నీర్సంగా అన్నాడు పవన్.

"అవును యాపారమే!" మళ్లదే సలహా.

"అందుకు నా దగ్గర అంత డబ్బులేదే!" నీళ్లు నమిలుతూ తన ఇంటి ఆర్థికపరిస్థితిని మనసులో తలుచుకున్నాడు.

ముకుందం నవ్వాడు.

"ఇదిగో పవన్! నేను నీకు సాయాన మేనమావను కదా! ఆ విషయం నాకొదిలేయ్! నేను సాయంత్రం వొచ్చి మీ నాన్నతో మాట్లాడుతాను. నువ్వు ఇంటికెళ్లి స్థిమితంగా ఉండ"ని భరోసా ఇచ్చి వంపేశాడు ముకుందం.

పవన్ మామయ్యకు ఇద్దరు కూతుర్లు. పెద్దమ్మాయి కౌశల్యను నాకిచ్చి చెయ్యమని మా అమ్మతో చెబితే,

"మీ బావకి ఇష్టంలేదు. నువ్వే అడుగ"న్నది అమ్మ అప్పట్లో. కానీ ఇప్పుడున్న మా పరిస్థితిలో మానాన్నేకాదు నేనుకూడా తలొంచక తప్పలేదు.

మామయ్య ఇచ్చిన ఏభైవేలు కట్నంతో బాంకునుండి మరో ఏభైవేలు అప్పుతో కొంతస్థలంలో కోళ్లఫారం పెట్టాక ఓ ఆరునెల్లో బాంకు అప్పు తీర్చేసి, ఫరవాలేదు బ్రతుకు బండి లాగించెయ్యొచ్చును అనుకున్నంతలో ఆ సంకటస్థితి వచ్చిపడింది.

గతాన్ని ఒక్కసారి తిరగేసిన పవన్‌కి తల్లి చేతులు ఆప్యాయంగా తల నిమరటంతో కనులు మెల్లగా తెరిచాడు.

"ఏవైంది బాబూ! అలా ఉన్నావు!" ఎంతో ఆప్యాయతగా, అనునయంగా అడుగుతూ కొడుకు ప్రక్కనే కూర్చున్నది తల్లి తాయారమ్మ.

తలచుకుంటేనే తల తిరిగిపోతోంది. అటువంటి విషయాన్ని తల్లితో ఎలా చెప్పాలో తెలియక సందిగ్ధంలో మౌనంగా ఉన్న కొడుకు స్థితిని అర్థం చేసుకున్న తల్లి మనస్సు ఆప్యాయంగా మరొకమారు కొడుకు తల నిమురుతూ.

"చూడు నాయనా! వ్యాపారం అన్నాక ఒడుదొడుకులు వస్తుంటాయి. అంతమాత్రాన ఇలా డీలాపడి మనసు పాడుచేసుకు కూర్చుంటే సమస్యలు పరిష్కారం అవుతాయా! లే! లేచి బట్టలు మార్చుకొని స్నానంచేసి కాస్త ఎంగిలివడు. అప్పటికి నీ మనసులో ఆలోచనలు కాస్తంత స్థిమితపడ్డాక నిదానంగా ఆలోచించితే ఏదో ఒకమార్గం దొరక్కపోదు" అంటూ ధైర్యం పోసిందా తల్లి.

000

రామకృష్ణకు భవిష్యత్ అంతా భయంకరమైన బ్రహ్మరాక్షసి అమాంతం మింగేందుకు నోరు చాస్తూ ముందుకు వస్తున్నట్టుంది.

ఇప్పుడిప్పుడే ముదురుతున్నా ఎండాకాలం దాహంతో నాలుక పిడచగట్టిపోతోంది.

"ఈదేశంలో ఇహ నాలాంటి వారి గతి ఏం కాను! ఛీ! ఎందుకీ దేశంలో బ్రతకాలనిపిస్తోంది" ఇలా ఆలోచిస్తున్న రామకృష్ణకు అప్రయత్నంగా గతం గుర్తుకొచ్చింది.

ఫస్ట్‌క్లాస్లో యస్.యస్.యల్.సి. పాసైన తను పైచదువులు చదివే స్థోమతు లేని సామాన్య రైతుబిడ్డ తను. విశాఖపట్నం డైరీఫారంలో పశువుల కాంపౌండరు ట్రైనింగుకోసం దరఖాస్తులు కోరుతున్నారని స్నేహితుడు పవన్ చెప్పి అప్లికేషన్ తెచ్చిచ్చాడు.

అదృష్టవశాత్తు ఆరోజుల్లో మార్కులనుబట్టి తనను సెలక్ట్ చేశారు. అప్పుడే ఉద్యోగం దొరికినంతగా సంబరపడిపోయాడు.

ట్రైనింగ్ పూర్తయ్యాక ఎంప్లాయ్‌మెంట్‌లో రిజిస్ట్రేషన్ చేయించి సంవత్సరాలు గడుస్తున్నా అదృష్టం నా తలుపు తట్టలేదు. దశాబ్దకాలంలో ఒకటిరెండు ఇంటర్వ్యూలొచ్చాయి. ఒక ఇంటర్వ్యూలో అధికారి "నీ బరువెంత'ని అడిగిన ప్రశ్నకు 65కేజీలన్నాను అమాయకంగా.

"లోకజ్ఞానం లేదు నీకు, నేనడిగింది నీ బరువుకాదు. వెళ్లు! నువ్వీ ఉద్యోగానికి తూగవని నీ మొఖమే చెబుతుంద"న్నారు.

ఇంకోదఫా ఇంటర్వ్యూలో ఒక లెక్క అడిగారు. "బజారులో అమృతఫాలీఫలాలు రెండే ఉన్నాయి. అవ్వి అవసరమున్న వ్యక్తులు పాతికమందున్నారు. వ్యాపారి అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆశిస్తాడు కదా!"

"అవును" అన్నాను అయోమయంగా.

"మరా పాతికమందిలో ఎవరెక్కువ ఖరీదు చెల్లిస్తారో వారికే కదా అవ్వి దక్కేది, ఏమంటావు?" అని తెలివిగా అడిగాను కదూ! అన్నట్టు తలెత్తి నాముఖంలోకి సూటిగా చూశాడా అధికారి.

ఆ లెక్కలో గూఢార్థం అర్థం అయ్యింది.

ఆకాశంలో చుక్కలు సహనంతో లెక్కపెట్టే ప్రయత్నం సాహసం చెయ్యగలనేమోగానీ, ఇంటర్వ్యూలో అధికారులు అడిగిన లెక్కకు,



ఎక్కాలు నాకు తెలియవు, అంటే కరక్టు ఆన్సర్ చెప్పడానికి నాకు స్థోమత చాలదు. ఆమాటే అన్నాను.

"ఫూర్‌ఫెలో! యూగో!" ఛీత్కారంగా పురుగుని విదిలించినట్టన్నాడు అధికారి.

అతివృష్టితో కొన్ని సంవత్సరాలు, అనావృష్టితో కొన్ని సంవత్సరాలు పంటలు పోయాయి, అప్పులు పెరుగుతున్నాయి.

తాళి కట్టింది పగలు ఎగతాళి చేసినా రాత్రికి సందిట్లోకి రాకమానదు. ఉడుకొచ్చాక అన్నం పొంగకమానదు. తపేలా వార్చక తప్పుతుందా! అలాగే ఇద్దరి బిడ్డలకు తండ్రినైపోయాను.

నాకే సిగ్గుండాలి. రోజంతా ఊరూరా తిరిగి "మాట్లేస్తాం... మాట్లేస్తాం" అని తిరిగేవాడి బ్రతుకులా ఉంది నా బ్రతుకు. ప్రతీ ఊరు వెళ్లి వాళ్ల కల్లాల్లో 'మీ పశువులు బాగున్నాయా?' అని అడిగితే.

"ఏం! చచ్చిపోవాలని కోరుతున్నావా? ఎల్లెల్లు మల్లెప్పుడు ఇటురాకు" అని కుక్కని కసిరినట్టు కసిరే జనం.

అడప, దడపా ఒకటి రెండు కేసులు తగిలితే వైద్యం చేశాక, "మంచిసేస్థివబ్బాయ్! ఇంటికెళ్లి ఓ కుంచెడు బియ్యం అడిగి తీసుకెళ్లు" అనే వాళ్లుతప్ప, నా వృత్తికి ఖరీదు కట్టలేని గరీబులే అంతాను.

"ఛీ!ఛీ! వెధవ బ్రతుకు, చావాలి" అనుకున్నప్పుడే పవన్ పనికట్టుకొని ఇంటికొచ్చి, "రామకృష్ణా! ఆరోజు నేనా కాంపౌండరు ట్రైనింగ్‌కి దరఖాస్తు తెచ్చి నీకివ్వబట్టే నేడు నీకీ గతి పట్టిందేమోరా! అందుకు కొంత నాదీ బాధ్యత ఉంది. అందుకే నేనొక ఉద్యోగం నీకు ఇస్తున్నాను. నెలకు వెయ్యిరూపాయల జీతం. ముందు ఇంకా పెరగనూ వచ్చుని" అన్నాడు.

అచేతనంగా ఉండిపోయాన్నేను.

నేనేం చెప్పాలో నాకర్థం కావడంలేదు. నా పెదాలు వణుకుతున్నాయి.

"పవన్! న్ని...నిజం... న్ని..." గొంతు పెగలటంలేదు. మళ్లీ పవన్ అన్నాడు భుజం తడుతూ.

"రామకృష్ణా! నిజంగానే చెబుతున్నాను. ఇంతవరకు మనం అనుభవించిన నిరుద్యోగ జీవితం ఒక పీడకలగా ఊహించుకుందాం. నేను కోళ్లఫారం పెడుతున్నాను. నువ్వు నా ఫారంలో కోళ్లకి వ్యాధి నిరోధక ఇంజక్షనులు,వాటి సంవరక్షణ, సంబంధిత వ్యవహారాలు ఇకనుండి చూసే బాధ్యత నీదే" అన్నాడు.

కన్నీళ్లతో "థాంక్యూ... పవన్... థాంక్యూ" వేరే ఇంకోమాట చెప్పలేని తన్మయత్వం, ఆనందంతో స్నేహితుడిని గాఢంగా కౌగలించుకున్నాడు రామకృష్ణ.

000

పరిస్థితులు మనిషికి అనుకూలంగా లేనప్పుడు మెంటల్ టార్చరింగ్ వలన కనీసం ఊహల్లో కూడా తృప్తి, తీపిదనం ఉండదు. అదే పవన్ ప్రస్తుత పరిస్థితి.

కోళ్లఫారం దగ్గరగా ఉన్న తాటాకుల పాకలో కూర్చున్న పవన్‌కి బుర్రలో అగ్నిపర్వతాలు బద్దలైనట్టు లావా ఉప్పొంగి ప్రవహిస్తున్నట్టు ఏదో బాధ, భయంతో కంపించుకుపోతోంది శరీరం.

ముందు, ముందు బ్రతకటం ఎంత దుర్భరమో ఊహించుకుంటే శరీరం గగుర్పొడుస్తోంది. ముందుగా తెచ్చిన ఏభైవేలు బాంకు అప్పుతీర్చాక మళ్లా ఒక లక్షరూపాయలు అప్పుతీసుకుని మరో రెండు షెడ్డులు వాటికి అవసరమయ్యే కోళ్లను కొనటం. మొత్తం దానా ఇంటివద్దనే స్వంతంగా తయారు చేసుకునేందుకు మిషను కూడా కొనటం జరిగింది. ఇప్పుడివ్వన్నీ ఏంకాను? అప్పు ఎలా తీర్చటం? కుటుంబాన్ని ఎలా పెంచుకురావాలి? నిన్నటివరకు తనకంత కష్టమనిపించలేదు. అన్నవస్త్రానికి లోటులేకుండా, ఆస్తులు పెంచకపోయినా అప్పులు పాలవ్వలేదు. మరిప్పుడు...? ఎలా... ఎలా....! అన్నదే తీరని సమస్య అయికూర్చున్నది కళ్లముందు. పవన్ తల తిరిగిపోతోంది.

"హే! భగవాన్! ఎందుకీ బ్రతుకు?" కుడిచేతితో లలాటాన్ని పట్టి భారంగా కళ్లుమూసుకున్నాడు పవన్.

"నీకోసం అంతా వెతికాను! ఇక్కడేం చేస్తున్నావు?" భుజం తట్టి అడుగుతున్న స్నేహితుడు రామకృష్ణ మాటలకి బాహ్యప్రపంచంలోకి వచ్చిన పవన్, తనలోని నిస్సత్తువుని బలవంతంగా విదిలిస్తూ సన్నగిల్లిన శక్తిని కూడదీసుకొని.

"రామకృష్ణా! తలచుకుంటే భవిష్యత్ భయంగా నీకనిపించటం లేదా?" అడిగాడు.

స్నేహితుడి మొఖంలో మారుతున్న భావాలని గమనిస్తూ, "నిజమే! ఏం పాలుపోవటం లేదు నాకునూ" పవన్ భావాలతో తను అనునయించక తప్పలేదు.

"పద! ఫాల్రీవద్దకు వెళ్లి మాట్లాడుకుందాం" స్నేహితులిద్దరు అటుగా నడిచారు.

000

తెల్లార్తూనే దినపత్రికలో వచ్చిన వార్త సంచలనం అయ్యింది! కలర్‌లో బాక్సు కట్టున్న హెడ్‌లైన్ "మేం.... చచ్చిపోతున్నాం!"

ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఓ) నిబంధన మేరకు విదేశీవస్తువుల దిగుమతులకు తలుపులు బార్లా తెరచి, దేశీయ పరిశ్రమలను, రైతులను నిలువునా నాశనకర ప్రయత్నంలో అందుకు సమిధలుగా కోళ్లఫారమ్ నడుపుతున్న పవన్‌కుమార్, అదే ఫారమ్‌లో కాంపౌండర్‌గా పనిచేస్తున్న రామకృష్ణలు. జిల్లా కలెక్టర్‌కు, సమాజానికి తెలియజేస్తూ ఉత్తరాలు వ్రాసి ఆత్మహత్యలు గావించుకొన్నారు.

అప్పులు తెచ్చి కోళ్లఫారం నడుపుతూ, నలుగురికి ఉపాధిగా ఉంటూ బ్రతుకుతున్న వారి జీవితాల్లో డబ్ల్యూ.టి.ఓ. పుణ్యమా అంటూ నిప్పులు చెరిగి బ్రతుకులు భ్రష్టుపట్టించే నిర్ణయం ముందు మా చావులకు మాత్రమేకాదు. మా కుటుంబాల బాధ్యత, మా అప్పుల బాధ్యత భయంతో "మేం.... చచ్చిపోతున్నాం"

■

(చైనా నుండి దిగుమతి చికెన్ 500గ్రాములు 15రూపాయిలు, రూపాయికి రెండుకోడిగ్రుడ్డులు. ఇక స్వదేశి పరిశ్రమ, మా శ్రమ ఏంకాను? ఆలోచించండి!)